# రుణం

## మాడుగుల కృష్ణకుమారి

పేషంట్లతో కిటకిటలాడుతోంది బిందు నర్సింగ్‌హోమ్. ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా పేషంట్లను ఓపికగా చూస్తోంది డాక్టర్ బిందుమాధవి.

పది గంటల టైములో కాస్త తీరిక దొరకటంతో రిలాక్స్ అవటంకోసం కాఫీ త్రాగుతోంది.

హడావిడిగా వచ్చిన నర్సు ఎవరో యాక్సిడెంట్ పేషంట్‌ను తెచ్చారన్న వార్త తెలిసింది.

వస్తున్నాను హడావిడిగా లేచింది డాక్టర్–

బల్లమీద అచేతనంగా పడివున్నాడు ఆ వ్యక్తి. పొట్టి ఖాకీ నిక్కరు, బాగా మాసిపోయి రంగు తెలియని చేతులున్న బనియను. ఎండి కుచ్చించిన బలహీనమైన శరీరం.

తలకు చుట్టుకున్న మురికి తువ్వాలు రక్తంతో తడిసి ముద్దయింది. ఆ తువ్వాలు తొలగించి గాయాన్ని క్లీన్‌చేసి రెండుచోట్ల కుట్లు వేసింది.

మోచేతులకు తగిలిన గాయాలకు మందువేసి ప్లాస్టర్స్ వేసింది. చేతులు క్లీన్‌చేసుకొని టవల్‌తో చేతులు తుడుచుకుంటున్న ఆమెకు–

యాక్సిడెంటయిన వ్యక్తి పేరు రిక్షా అప్పన్నని, రెండో ట్రిప్ పిల్లల్ని కాన్వెంటుకు తీసుకు వెడుతున్న సమయంలో యాక్సిడెంట్ జరిగిందని తెల్సింది.

ఇంజక్షన్ చేసే సిరంజ్ బయటకు తీస్తున్న డాక్టరు వులిక్కిపడి ఓసారి పరీక్షగా అతనివైపు చూసింది.

పీక్కుపోయిన దవడలు, ముడతలుపడ్డ ముఖంలో ఏవో పోలికలు అస్పష్టంగా కదలాడ సాగాయి.

ఆ అప్పన్నే, ఈ అపన్న కాదుకదా అనుకుంది.

మరికొంతసేపు పక్కనే నిలబడి అతడి ముఖంలోకి చూస్తుండిపోయింది.

బాధగా మూల్గుతూ అస్పష్టంగా ఏదో అంటున్నా యతని పెదవులు. పూర్తిగా అర్థం కాకపోయినా పిల్లలు, స్కూలు అన్న మాటలు మాత్రం తెల్సినాయి డాక్టరుకి.

అప్పు డామెకు ఖచ్చితంగా అన్పించింది ఆ అప్పన్నే ఈ అప్పన్నని.

అప్పన్నకి ఎప్పుడు స్పృహ వస్తుందా అన్న ఆరాటంతో పక్కనే కుర్చీ లాక్కుని కూర్చుంది.

రెండు గంటలవరకు భోజనమయినా చెయ్యకుండా ఒక రిక్షామనిషి దగ్గర కూర్చుని క్షణ క్షణానికి చూస్తున్న డాక్టరు వైఖరి అర్థంకాని నర్సు ఆయోమయంలో పడిపోయింది.

తదేకంగా అప్పన్న ముఖంలోకి చూస్తున్న బిందుమాధవి మనసు ఒక్కసారిగా వెనక్కు పరుగెత్తింది.

* * *

"బిందు త్వరగా అన్నం తిన్నమ్మా! అప్పన్న వచ్చేస్తాడు. మళ్ళా ఆలస్యం అవుతుంది" కూతుర్ని కేకవేసింది దుర్గ.

భోజనం పూర్తిచేసి సాక్స్ తొడుక్కుంటున్న బిందుకి అప్పన్న రిక్షా గంట వినబడనే వినబడింది.

"బిందమ్మా బేగిరావాలి" అన్నాడు అప్పన్న బెల్ మోగిస్తూ.

"వస్తున్నా నుండు అప్పన్నా" అంది చిరుకోపంగా బిందు.

"నా తల్లి బేగి రావాలి. ఇయ్యాల పరీచ్చ వుంది మర్చిపోయావా?" అన్నాడు.

బిందు స్కూల్‌బేగ్, కారియర్ తీసుకుని రిక్షాలో పెట్టి, "పద్మమ్మా నువ్వెప్పుడు ఎక్కుతావు తల్లీ నా బండి" అన్నాడు రెండేళ్ళ పద్మని ముద్దాడుతూ.

"వచ్చే ఏడు ఇది కూడా వస్తుందిలే అప్పన్నా" అంది దుర్గ నవ్వుతూ.

'అమ్మా టాటా! పద్మా టాటా' అని తల్లికి చెల్లెలికి చెప్పి రిక్షా ఎక్కింది బిందు.

రిక్షా సందు తిరిగేవరకు చూస్తుండిపోయింది దుర్గ.

అప్పన్నంటే ఎందుకో తెలియని అభిమానం దుర్గకి. మరే రిక్షా అతను పిల్లల్ని అంత నమ్మకంగా తీసుకువెళ్ళడని ఆమె నమ్మకం. సాధారణంగా మిగిలిన రిక్షావాళ్ళు స్కూల్ వదిలే సమయానికి వస్తారు. కానీ అప్పన్న నివాసం మాత్రం ఎప్పుడూ స్కూల్ దగ్గరే.

ఏ సమయంలో స్కూల్ వదిలితే ఆ టైములో పిల్లల్ని యిల్లు చేరుస్తాడు.

ఓసారి సెకండ్‌క్లాసులో వున్నప్పుడు బిందు పక్క పిల్లలతో కలసి నడిచి ఇల్లు చేరింది.

అంతే స్కూల్లో బిందు లేకపోవటంతో అప్పన్న గుండె ఆగిపోయింది. అదురుతున్న గుండెలతో ఇంటికి చేరాడు. ఇంటి దగ్గర బిందుని చూశాకగానీ అతడి మనసు శాంతించ లేదు.

"ఇంకెప్పుడూ ఇలా సేయకు తల్లీ" అని బిందుకు చెప్పి, పక్క పిల్లల్ని మందలించాడు ఎందుకు బిందుని నడిపించారని.

దుర్గ కూడా కూతుర్ని కేకలువేసింది.

ఇప్పుడు బిందు 5వ క్లాసుకి వచ్చింది.

"అప్పన్నా నీ కెవరు లేరా? అస్తమానం స్కూల్ దగ్గరే వుంటావు?" అనడిగింది అప్పన్నని.

"ఓ కొడుకున్నాడమ్మా! నా ఆడది పోయిన కాడ్నించి, అళ్ళ ముత్తవ్వదగ్గరే పెరుగుతున్నాడు" అన్నాడు నవ్వుతూ.

"అప్పన్నా రిక్షాకి చుట్టూరా ఈ తాడే యెందుకు కడతావు?" అనడిగింది పద్మ.

"మీరు చిన్న పిల్లలు కదమ్మా! పడిపోకుండా వుండాలని" అన్నాడు.

రోజూ తను ఎందరో పిల్లల్ని స్కూల్‌కు తీసుకువెడుతున్నా, ముద్దుగా బొద్దుగా వుండే బిందంటే ఎంతో ప్రాణం అప్పన్నకి.

వయసు పెరిగేకొద్ది బిందుకి కూడా అప్పన్నంటే ఏదో తెలియని అభిమానం పెరగసాగింది.

మిగతా బండ్లవాళ్ళయితే రైల్వేబ్రిడ్జ్ యివతల ఆపి పిల్లల్ని వెళ్ళమంటారు. కానీ అప్పన్న అలాకాదు. అందర్నీ చెయ్యిపట్టుకుని మరీ అవతలకు దింపుతాడు.

ఎవరికి ఏ చిన్న దెబ్బ తగిలినా, తను గిలగిల లాడిపోతాడు. ఎండయినా, వానయినా తనకి జ్వరం వచ్చినా సరే ఒక్కరోజూ కూడా సెలవుపెట్టడు. టైముకల్లా పిల్లల్ని స్కూల్‌కి చేరుస్తాడు. స్కూల్లో ఎవరు ఏది మర్చిపోయినా జాగ్రత్తపరిచి వాళ్ళకి అందజేస్తాడు.

తా మిచ్చే డబ్బు ఎటుపోతోందో కానీ పిల్లల్ని క్షేమంగా చేరుస్తున్నారు.

అదే కొండంత ధైర్యం దుర్గకి, భర్త నారాయణకు.

"అమ్మా! ఈ రోజు అప్పన్న ఏం చేశాడో తెల్సునా?" అంది రిక్షా దిగుతూనే బిందు ఫిర్యాదుగా.

"ఏం చేశాడమ్మా?" అంది దుర్గ.


"ఉదయం నా పుట్టిన రోజని అందరితో పాటు చాక్లెట్లు యిచ్చాను. తినొచ్చుకదా! తినకుండా ఈ పద్మ కిచ్చాడు" అంది చెల్లెలివైపు కోపంగా చూస్తూ.

"ఏం అప్పన్నా" అంది దుర్గ.

"పద్మమ్మ స్కూల్‌దడి ఏడుస్తోందమ్మా! అందుకే

దాచివుంచి యిచ్చాను. ముసలాడ్ని నా కెందుకమ్మా ఈ బిళ్ళలు. ఎవరన్నా యిచ్చినా వుంచి పిల్లలకే యిస్తాను."

"అయితే అందుకు శిక్షగా అప్పన్న కీ రోజు మనింట్లో భోజనం" అంది కిలకిలా నవ్వుతూ బిందు.




"బిందు అర్ధరేసిందిగా తప్పదింక అప్పన్నా" అంది దుర్గ.

"ఏటోనమ్మా మీరు మీ అభిమానం" అన్నాడు సిగ్గుగా అప్పన్న.

* * *

ఆవేళకి వారం రోజులనుంచి ముసురుపట్టి ఒకటే వర్షంగా వుంది.

రాత్రి పదిగంటలయింది.

ఒళ్ళెరగని జ్వరంతో వున్న బిందుని చూస్తుంటే భయంగావుంది దుర్గకు. సమయానిక్కి నారాయణ కూడా లేడింట్లో. క్యేంపుకు వెళ్ళాడు.

సాయంకాలం టెంపరేచరు చూసిన డాక్టరు పదకొండు దాటాక జ్వరం జారకపోతే మాత్రం తన క్లినిక్కి తీసుకురమ్మన్నాడు.

జ్వరం తగ్గే జాడ కన్పించకపోగా మరింత పెరుగుతోంది. జ్వర తీవ్రతతో ఏదేదో మాట్లాడుతోంది బిందు.

ఈదురుగాలి, వానతో బయట ప్రళయంగా వుంది.

ఈపరిస్థితిలో రాజమండ్రి స్టేషను నుంచి భారత బొమ్మ దగ్గర కంటే మాటలా?

ఒంటరిగా ఈ వానలో పిల్లల్తో తను....

తల్చుకుంటేనే భయంగా వుంది దుర్గకు.

కూతిరి పరిస్థితి చూస్తుంటే ఓవైపు ఆందోళనగా వుంది. గాబరాగా లేచి పక్కింటివాళ్ళ తలుపుతట్టి పరిస్థితి చెప్పింది.

"మావారు అమితమైన తల నెప్పితో పడుకున్నారు. ఎలా లేపడం? అయినా ఈ గాలి వానలో ఎలాబాబు" అని సమాధానం కోసం కూడా చూడకుండా తలుపు మూసుకుందావిడ.

నిజంగా ఏడుపే వచ్చింది దుర్గకి.

అప్పటికి నాల్గుసార్లు వచ్చివెళ్ళాడు అప్పన్న పిల్లకి ఎలా వుందని. తొమ్మిది గంటల ప్రాంతంలో ఆఖరిసారిగా వచ్చినప్పుడు తనే చెప్పింది "ఈ గాలి వానలో మళ్ళీ రాకు. బిందుకి కొత్త మాత్రలు వేశాను. జ్వరం పోతుందిలే" అని.

పాపం! అలాగే అని చెప్పి వెళ్ళాడు.

ఇప్పుడేం చేయాలి? తలుపు తీసి బయటకు చూద్దామన్నా ధైర్యం చాలటంలేదు.

క్షణక్షణానికి టెంపరేచర్ పెరిగిన గుర్తుగా కూతురి మూల్గు ఎక్కువయిపోతోంది.

ఆక్షణంలో తలుపు తట్టిన శబ్దం వినబడింది.

తన భ్రమేమో – అన్న అనుమానంతో ఆగినా మళ్ళీ శబ్దం అవటంతో తీసింది.

ఎదురుగా అప్పన్న!

వానకు తడిసి నీళ్ళోడుతున్న అప్పన్న.

ఒక్కసారిగా విషయం చెప్పి బావురుమంది దుర్గ.

"భయపడకండమ్మా ఆస్పటాలికి ఎడదాం" అన్నాడు.

"ఈ గాలి వానలో అంత దూరం" అంది అనుమానంగా.

'మరేం ఫర్వానేదు" అని బిందుని దుప్పటితో సహా ఎత్తుకున్నాడు.

అదురుతున్న గుండెలో, పద్మని తీసుకుని తలుపు లాక్ చేసింది దుర్గ.

ఈదురుగాలికి రోడ్డుమీద ఒక్క పిట్టకూడా లేరు. కరెంటు ఫెయిలవడంతో రోడ్డంతా చిమ్మచీకటిగా




## దానం తెచ్చిన దీనత్వం

ఇంగ్లాండ్‌లో 1567–1640 మధ్య కాలంలో సర్ విలియం అలెగ్జాండర్ ఎరల్ ఆఫ్ స్టర్లింగ్‌గా ఉండేవాడు. అప్పటి బ్రిటిష్ ప్రభువైన 1వ జేమ్స్‌కి ఈయనంటే తగని అభిమానం. ఆ అభిమానాన్ని మాటల్లో కాకుండా క్రియాపూర్వకంగా చూపించాలనుకున్నాడు. 1621 సెప్టెంబర్ 29న ఒక దాన పత్రం రాసి ఇచ్చాడు. దాని ప్రకారం నోవాస్కోషియా, మొత్తం కెనడా అలెగ్జాండర్‌కి చెందుతాయి. ఈ భాగాలు, దానికి సంబంధించిన ద్వీపాలు, అగాధాలు, నదులు, అడవులు, గనులు అన్నీ ఆయన సొంతమే. ఆ కొత్త ప్రదేశంలో నగరాలు, పట్నాలు, గ్రామాలు నిర్మించుకోవచ్చు. కోర్టులను, ఆఫీసులను ఏర్పరచుకోవచ్చు. సొంతంగా కరెన్సీని ముద్రించుకోవచ్చు. అంటే సర్వసత్తాక సార్వభౌమ్యమన్నమాట. అయితే దానం అంటే అగౌరవపరచినట్లుంటుందని దీని ధర కేవలం ఒక స్కాటిష్ పెన్నీగా నిర్ణయించి, దానిని క్రిస్టమస్ రోజున చెల్లించమని రాశారు. ఇలా ఇచ్చిన భూభాగం వైశాల్యం, బ్రిటన్‌కి ప్రపంచంలో ఇతర చోట్ల వున్న కాలనీల మొత్తం వైశాల్యం కంటే ఎక్కువే. జేమ్స్ ప్రభుత్వ అభిమానం అంతటితో ఆగలేదు. ప్రస్తుతం యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాలోని ఉత్తర భాగంలోని అత్యుత్తమ ప్రదేశాలను కూడా ఆ తర్వాత ఇచ్చాడు.

అయితే "అదృష్టవంతుడ్ని చెరపలేరు–దురదృష్టవంతుడ్ని బాగు చేయలేరు." అన్న సామెత అలెగ్జాండర్ విషయంలో అక్షరాలా నిజమయింది. ఇంత ఘనంగా లభించిన భూభాగాన్ని అభివృద్ధి చేయాలన్న ఉద్దేశ్యంతో, ఆ రోజుల్లో 10 లక్షల డాలర్లని పెట్టుబడిగా పెట్టాడు. అయితే ఆ డబ్బు చాలకపోవడమే కాక చేసిన ప్రయత్నం పూర్తిగా విఫలమయింది. చివరికి పూర్తిగా దివాళా తీసి చేతిలో చిల్లి గవ్వ లేకుండా దిక్కులేని చావు చచ్చాడు అంతటి ఎరల్.

– కె. ఆర్. కె. మోహన్

## రుణం

వుంది.

అప్పన్న బలమంతా వుపయోగించి బండిని ముందుకు తొక్కుతున్నాడు.

ఆ గాలివానలో ఒక్కడుగు ముందుకు వెళ్ళటాన్కి గగనంగా వుంది.

చలి శరీరాన్ని కొరికివేస్తోంది, కాలువల్లాటి రోడ్లమీద తను దిగి బండి నడిపిస్తూ ఎట్లాగో ఆస్పటలు చేర్చాడు అప్పన్న.

అంత రాత్రివేళ వచ్చిన వాళ్ళని చూసి ఆశ్చర్యపోయాడు డాక్టరు.

రెండు ఇంజక్షన్స్ యిచ్చిన డాక్టరు మరోదాని కోసం చూశాడు. లేదు.

ఫ్రిజ్‌లో చూశాడు. అక్కడా లేదు.

"అర్జంటుగా ఈ ఇంజక్షన్" అన్నాడు దుర్గకి ప్రిస్క్రిప్షన్ కాగితం ఇస్తూ డాక్టరు.

ఆ కాగితం తా నందుకుని వేగంగా వెళ్ళాడు అప్పన్న.

కళ్ళప్పగించి చూడటం తప్ప డబ్బివ్వాలన్న ఆలోచన కూడా రాలేదు దుర్గకి.

మరో అరగంటకల్లా చేతో ఇంజక్షన్‌తో ప్రత్యక్షమయ్యాడు.

బిందుకి ఇంజక్షన్ చేస్తూనే "ఇంత రాత్రివేళ ఎక్కడి నుంచి తెచ్చావోయ్?" అనడిగాడు డాక్టరు.

"రాజమండ్రి స్టేషనుకాడ కొట్టువాళ్ళింట్లో లేపి తెచ్చానండి. అయ్యా డాక్టరుబాబు మా బిందమ్మకి ఫర్వాలేదుగా" అన్నాడు.

ఆ సమయాన్కి తీసుకువచ్చారు కాబట్టి అంతా సవ్యంగా జరిగింది. తెల్లారి పాప నింటికి తీసుకు వెళ్ళచ్చు."

ఆ సమయంలో దుర్గకి అప్పన్న సింహాద్రి అప్పన్న లాగే కన్పించాడు.

అతడివైపు ఆప్యాయంగా చూస్తూండిపోయింది.

"ఏమవుతాడండి యితను మీకు?" అనడిగిన డాక్టరు ప్రశ్నకు సమాధానంగా....

"మా పాలిటి దేముడు" అంది దుర్గ కళ్ళు తుడుచుకుంటూ.

అర్థంకానట్లు చూశాడు డాక్టరు.

* * *

"అప్పన్నా ఒళ్ళు తెల్సిందా? నెప్పులన్నీ బాగా తగ్గాయా?" అని ఆప్యాయంగా అడుగుతున్న డాక్టరు మాటలకు నోరు తెరుచుకుని చూశాడు అప్పన్న.

ఏం అప్పన్నా గుర్తు రాలేదా? నీ రిక్షాలో బిందు అనే అమ్మాయిని, రైల్వేకాన్వెంటుకు తీసుకు వెళ్ళేవాడివి రాజమండ్రిలో" అంది నవ్వుతూ.

ఒక్కక్షణంపాటు నీలం రంగు యూనిఫారంలో బొద్దుగా వున్న ఓ పాప రూపం కదలాడిందతని మనసులో.

ఆ స్థానంలో యవ్వనంలో వున్న అందాల అమ్మాయి.

"అమ్మా బిందూ! ఎంత పెద్దదానివయివావు తల్లీ. నాన్నగార్కి ట్రాన్స్‌ఫర్ అయి వెళ్ళిపోయారు. అప్పుడే ఆఖరుసారి చూశాను. బాగున్నావాఅమ్మా. నా బిందు తల్లి డాక్టరయ్యిందా! చెల్లాయి ఎక్కడుందమ్మా?" అన్నాడు ఆనందంతో కళ్ళు తడుపుతుంటే.

"చెల్లాయి యిక్కడే లా చదువుతోంది. అవును ఇంత ముసలితనంలో కూడా ఇంకా రిక్షా తొక్కుతున్నావా?" అంది ఆశ్చర్యంగా.

"ఏం చెయ్యనమ్మా! నా కొడుకు లారీ యాక్సిడెంట్‌లో పోయాడు. కోడల్ని, మనవల్ని పోషించాలిగా. అందుకే ఈ బండి తప్పింది కాదు."

"మళ్ళీ ఈ జలమలో నిన్ను కళ్ళచూస్తాననుకో లేదమ్మా. పెళ్ళిచేసుకున్నావా తల్లీ?" అని ఆప్యాయంగా అడుగుతుంటే సిగ్గుగా తలవూపింది బిందు అవును అన్నట్లుగా.

చూడు అప్పన్నా! రేపట్నుంచి నువ్వు బండి తొక్కటం మానెయ్యాలి తెల్సిందా?"

"మరి నా వాళ్ళమ్మా?"

"నీ కోడలేమన్నా చదువుకుందా?"

"పదో కలాసు సదివిందమ్మా."

"అయితే విను. నీ కోడలికి నా ఆస్పటల్లో నర్సు వుద్యోగం ఇస్తున్నాను. నువ్వు నా దగ్గరే వాచ్‌మన్‌గా వుండాలి. అంతేకాదు రేపట్నుంచి నీ మకాం, నా ఔట్‌హవుస్‌కు మార్చు. తెల్సిందా?" అంది చిరునవ్వుతో.

ఆమ్మా బిందు! ఈ ముసలాడిమీద ఎంత దయ తల్లీ నీకు! నీ రుణం తీర్చుకోలేనమ్మా" అని చేయ్యెత్తి నమస్కరిస్తున్న అప్పన్నని వారిస్తూ....

"దీవించవలసిన చేతులు నమస్కరించకూడదు అప్పన్నా. నా చిన్ననాటి వర్షం రాత్రి నువ్వు నన్ను రక్షించకపోతే నీ రుణం తీర్చుకునే అవకాశం నాకు దక్కేదికాదు." అని చెమర్చిన కళ్ళను కర్చిఫ్‌తో అద్దుకుంది బిందు. ◘